నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: బన్సీలాల్‌పేట్, మోండా మార్కెట్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 13న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓల్డ్‌జైల్‌ఖానా, సిటీలైట్ హోటల్, విక్టోరియాగంజ్, రాణిగంజ్, అంజయ్య కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం గంటల వరకు పాలికాబజార్, సౌత్ ఇండియ చర్చ్, ప్రకాష్ హాస్పిటల్, ఓల్డ్ గాంధీ ఆస్పత్రి, అఫ్జల్ అల్లావుద్దీన్ క్రిస్టల్ ప్లాజా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో లక్ష పుష్పార్చన



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో లక్ష పుష్పార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మంగళవారం అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య జరిగిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు సమర్పించారు.

మరో చెట్టుకు ప్రాణం పోసిన పోలీసులు



భారీ వృక్షాన్ని తరలిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

రాంగోపాల్‌పేట్: ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్న ఓ భారీ వృక్షాన్ని ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు మరో చోటకు తరలించి దానికి జీవం పోశారు. కొద్ది రోజుల నుంచి ట్రాఫిక్ ఏసీపీ ఇలాంటి భారీ వృక్షాలను వేరే చోటకు తరలించి వాటిని సంరక్షిస్తున్నారు. మంగళవారం తాజ్‌మహల్ హోటల్ ప్రాంతంలోని ఒక వృక్షాన్ని మహబూబ్ కళాశాలకు తరలించారు. దీంతో ట్రాఫిక్ అవాంతరాలు తగ్గడంతో పాటు భారీ వృక్షాన్ని కాపాడినట్లు అవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నజీముద్దీన్, ఎస్‌ఐలు శ్రీధర్, మహేశ్ పాల్గొన్నారు.

మాలలకు న్యాయం చేయాలి



రామ్‌చందర్‌రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న మాల సంఘాల జేఏసీ నేతలు

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చేస్తున్న ధర్మ పోరాటంలో భాగంగా పలువురు జేఏసీ నాయకులు మంగళవారం తార్నాకలోని ఆయన నివాసంలో హౌజ్ అరెస్టులో ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్‌రావును కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో ఏకపక్షంగా చేసిన ఎస్సీ వర్గీకరణ ద్వారా గ్రూప్ 3లో ఉన్న 26 మాల, మాల ఉపకులాలకు విద్యా, ఉద్యోగాల్లో రోస్టర్ పాయింట్ 22 ద్వారా మాలలకు పూర్తిగా అన్యాయం జరుగుతుందని రామ్‌చందర్‌రావుకు వివరించారు. కావునా తెలంగాణలోని దాదాపు 40 లక్షల మంది మాలలకు న్యాయం చేసేలా బీజేపీ పక్షాన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాయాలని రామ్‌చందర్‌రావుకు విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేర బాలకిషన్, గౌరవ అధ్యక్షుడు చెరుకు రామ్‌చందర్, విద్యార్థి జేఏసీ నాయకులు రాహుల్, సైదులు, వీరస్వామి, ప్రణయ్, రేణు కార్తీక్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు వడ్డేటీ దేవేందర్, సంగోది పరమేష్‌కుమార్, ఎం, నర్సింగరావు తదితరులు ఉన్నారు.

పోలీసుల అదుపులో దాడి చేసిన వ్యక్తులు

అమీర్‌పేట: దాడి కేసులో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వెంగళరావునగర్ ప్రభుత్వ స్కూల్లో హెచ్ఎంగా పని చేస్తున్న మధుసూదన్ సోమవారం విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికెళ్తుండగా, సుందర్‌నగర్ కాలనీ కమాన్ వద్ద దాడి జరిగిన విషయం విధితమే. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతని వాహనం అడ్డగించి ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరిపిన ఎస్ఆర్‌నగర్ పోలీసులు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి నిందితులను గుర్తించారు. దాడి చేసిన వ్యక్తులు బోరబండలో నివసిస్తూ మేస్త్రీ పని చేసుకునే ప్రభుకుమార్, కిరణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. సుందర్‌నగర్ కాలనీ వద్ద మధుసూదన్ తన వాహనాన్ని ఎడమవైపు తీసుకుంటూ తమ వాహనాన్ని ఢీకొట్టాడని నిందితులు విచారణలో చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా



హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న జాయింట్ సీఈవో పల్లవి, భానుక నర్మద



పురవీధుల్లో జాతీయపతాకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో మంగళవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. వందమీటర్ల జాతీయ పతాకం ప్రదర్శిస్తూ మడ్‌ఫోర్ట్ హాకీ మైదానం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ, ఎంఈఎస్ క్వార్టర్స్, కేజేఆర్ గార్డెన్, మడ్‌ఫోర్ట్ చౌరస్తా, మస్తానా చౌరస్తా ద్వారా తిరిగి మడ్‌ఫోర్ట్ హాకీ మైదానం చేరుకుంది. ఈ సందర్భంగా బోర్డు జాయింట్ సీఈవో పల్లవి విజయ్‌వంశీ మాట్లాడుతూ జాతీయసమైక్యతకు, దేశభక్తికి మన దేశ త్రివర్ణపతాకం గౌరవ సూచకమని అన్నారు. ప్రతీ ఇంటిపై త్రివర్ణపతాకం ఎగురవేయాలని కోరారు. బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన గొప్ప కార్యక్రమం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమమని అన్నారు. మనదేశ ప్రజల సామూహిక సంఘీభావంతో, స్వాతంత్ర్య సమర యోధుల పోరాటాన్ని గుర్తు చేసుకోవడంతో పాటు మన రాజ్యాంగాన్ని గౌరవించే కార్యక్రమమని అన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు జాయింట్ సీఈవో పల్లవి విజయ్‌వంశీ, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద, బోర్డు వివిధ విభాగాల సూపరింటెండెంట్ అధికారులు, బోర్డు చీఫ్ ఇంజనీర్ ఉమాశంకర్, హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, శానిటరి సూపరింటెండెంట్ ఆకుల మహేందర్, తజ్ముల్లా అక్బర్, కేవీ. రమణ రావు, చౌహాన్, అమిత్, పుష్పేందర్, శానిటరి విభాగం సూపర్‌వైజర్లు, సిబ్బంది, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ రాణిగంజ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను బీజేపీ నాయకులు మంగళవారం శుభ్రం చేశారు. పాలు, నీళ్లలో విగ్రహాలను కడిగారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్, ఎస్ఆర్ మల్లేశ్, సందీప్ వర్మ, ఆకుల ప్రతాప్, ఆనంద్ వ్యాస్, శ్రీనివాస్ యాదవ్, మనోజ్ తదితరులు కలిసి విగ్రహాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం మాసంలో దేశం కోసం పోరాడిన మహనీయుల సేవలను గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహనీయుల ఆశయాలను ఆచరణలో సాఫల్యం చేసినప్పుడే వారికి మనమందించే నిజమైన నివాళులన్నారు.



మహనీయుల విగ్రహాలను శుభ్రం చేసిన కార్పొరేటర్ సుచిత్రశ్రీకాంత్ తదితరులు



లాలాపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డి

దేశభక్తిని చాటిన ర్యాలీ..

లాలాపేట: స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15ను పురస్కరించుకొని బీజేపీ పిలుపు మేరకు మంగళవారం తార్నాక డివిజన్ బీజేపీ శ్రేణులు హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. లాలాపేట ఇసుకబాయి బస్తీ వద్ద నుంచి మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండ కార్తీకచంద్రారెడ్డి జాతీయ జెండా ఊపి తిరంగా ర్యాలీని ప్రారంభించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మహనీయులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ ర్యాలీ లాలాపేట, శాంతినగర్, తార్నాక, మాణికేశ్వర్‌నగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటారు.

డబుల్ ఇళ్లకు స్థలం కేటాయించండి

మంత్రికి ఎమ్మెల్యే వినతి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గణేశ్

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు సమీపంలోని 8 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించాలని ఎమ్మెల్యే గణేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలోనే ఏకైక ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన కంటోన్మెంట్‌లో పేదలు సైతం అధిక సంఖ్యలో ఉన్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మిగతా నియోజకవర్గాలతో పోలిస్తే కంటోన్మెంట్‌కు ఎక్కువ మొత్తంలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని గతంలోనే మంత్రులను కోరామన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు మూడు ప్రాంతాల్లో మాత్రమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం జరిగిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం కేటాయించాలని విన్నవిస్తామన్నారు. రక్షణ శాఖ, పౌర విమానయాన స్థలాల్లో వెలిసిన బస్తీల భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించుకొని అనువైన ప్రాంతాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించాలని ప్రతిపాదించామన్నారు. తన ప్రతిపాదనలకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు నరేందర్‌రెడ్డి, మంత్రి సీతక్క ఉన్నారు.

రజిత రచనలు సమాజంలో చైతన్యాన్ని కల్గించాయి

ఎమ్మెల్సీ వాణీదేవి

సనత్‌నగర్: ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత రచనలు సమాజంలో చైతన్యాన్ని కల్గించాయని ఎమ్మెల్సీ వాణీదేవి పేర్కొన్నారు. రజిత మరణంపై ఎమ్మెల్సీ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన రచనల ద్వారా తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసేందుకు తనవంతు పాత్ర పోషించారని తెలిపారు. బహిరంగ సభల్లో ఆమె ఉపన్యాసాలు ఉద్యమం వైపు ఆకర్షితులయ్యేలా చేశాయన్నారు. ఆమె రాసిన వ్యాసాలు, పాటలు, కవితలు నేటి సమాజానికి మార్గనిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. ముఖ్యంగా స్త్రీ విముక్తి, స్త్రీలకు సామాజిక సమానత్వం కోసం చేసిన రచనలు స్ఫూర్తినిచ్చాయన్నారు. ఆమె ఆకస్మిక మరణం సాహిత్య రంగానికి తీరని లోటన్నారు. రజిత ఆత్మకు శాంతిచేకూరాలని ఈ సందర్భంగా ఆమె భగవంతున్ని వేడుకున్నారు.

పనులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి



జలమండలి జీఎం వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: పెండింగ్‌లో ఉన్న తాగునీటి, డ్రైనేజీ పనులను చేపట్టేందుకు సాధ్యమైనంత త్వరగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం సికింద్రబాద్‌లోని మారేడుపల్లి జలమండలి కార్యాలయంలో జీఎం వినోద్‌కుమార్‌ను కలసి సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్న మాట్లాడుతూ.. లాలాగూడ లిల్లీ మోడల్ స్కూల్ లైన్, బీ, డీ సెక్షన్, సీ–సెక్షన్‌లోని ఆర్ఆర్‌సీ మైదానం వెనుక భాగం, ఆజాద్ చంద్రశేఖర్ నగర్ తదితర ప్రాంతాల్లో నూతన మంచినీటి పైపులైన్ పనులకు త్వరగా ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కోరుతూ జీఎంకు వినతిపత్రం సమర్పించారు. వీటితోపాటు అవసరమైన ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను చేపట్టాలన్నారు. కార్పొరేటర్‌తో పాటు లింగాని శ్రీనివాస్ ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న నర్మద

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బస్తీలు, కాలనీల్లో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా బోర్డు నిధులు వెచ్చించి వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద అన్నారు. మంగళవారం మూడో వార్డు పరిధిలోని గన్‌రాక్ చౌరస్తాలో రూ.11 లక్షల వ్యయంతో పైగా కాలనీలో రూ.17 లక్షల వ్యయంతో చేపట్టనున్నట్లు భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను నర్మద ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిరంతరం ప్రజల సమస్యలను తెలుసుకుంటూ బోర్డు సీఈవో మధుకర్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకొని ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సహకారంతో ఎంపీ నిధులతో త్వరలో పలు అభివృద్ధి పనులు చేపడతామని హామీచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు అరుణ్, లీడర్ బాబు, విజయానంద్, మహిళలు వినోద, రేణుక, అనురాధ పాల్గొన్నారు.

సీతాఫల్‌మండిలో అగ్నిప్రమాదం



కాలిపోయిన గృహోపకరణాలు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ ఇందిరానగర్ కాలనీ రోడ్డు నంబరు 4లోని ఓ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికులు సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. పసంద్ క్యాటరింగ్ అండ్ కర్రీ పాయింట్ నిర్వహించే రాములు ఓంశ్రీ సాయిబాలాజీ అపార్ట్‌మెంట్ ఫస్ట్‌ఫోర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. మంగళవారం ఉదయం 8 గంటలకు హాలులోని దేవునిగదిలో పూజ చేసి ఇంటికి తాళాలు వేసి సమీపంలోని క్యాటరింగ్ కిచెన్‌కు వెళ్లారు. హాలులో కిటికీ తలుపులు తెరిచి ఉండడంతో దేవుని చిత్రపటాల ముందు వెలిగించిన దీపాలు గాలికి కిందపడి మంటలు అంటుకున్నాయి. ఇంటి లోపల నుంచి దట్టమైన పొగలు, మంటలు వ్యాపించడాన్ని గుర్తించిన స్థానికులు కిటికీ ద్వారా నీళ్ల పోసి రాములుకు సమాచారం అందించారు. రెండు ఫైరింజన్లు వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశాయి. గదిలోని ఫ్రిజ్‌తోపాటు గృహోపకరణాలు, దేవుని గదిలోని వస్తువులు మంటల్లో కాలిపోయాయి. సుమారు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు ఇంటి యజమాని రాములు తెలిపారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ సమన్వయకర్త రాజుసుందర్‌లు ఘటనస్థలాన్ని సందర్శించి వివరాలు అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వ తరుపున నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

గంజాయి స్వాధీనం, ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

కంటోన్మెంట్: నిషేధిత మాదక ద్రవ్యాలు కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను బోయిన్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తలరించారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. సాహు సోనూ, బండారి రవితేజ అనే ఇద్దరు వ్యక్తులు నిషేధిత గంజాయి ఉత్పత్తులు కలిగి ఉన్నట్లు సమాచారం అందడంతో, బోయిన్‌పల్లి అంజయ్య నగర్ సమీపంలో సోమవారం సాయంత్రం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 900 గ్రాముల గంజాయి, 175 చిన్న సీసాల్లో 870 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు గిరి, రాజేశ్‌ల కోసం గాలిస్తున్నారు.

ఇక పల్లె పల్లెకు బీసీ ఉద్యమం

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ ఉద్యమం పల్లె పల్లెకు విస్తరించాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం స్టేట్ కోఆర్డినేటర్ డా.అవ్వారు వేణుకుమార్ మంగళవారం పేర్కొన్నారు. పల్లెల్లో అసంఘటితంగా ఉన్న బీసీలను ఐక్యం చేయాల్సిన బాధ్యత విద్యార్థులు, విద్యావంతులపై ఉందన్నారు. 42 శాతం రిజర్వేషన్లతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్ తదితర రాష్ట్రాల మాదిరి రాజకీయ శక్తిగా బీసీలు ఎదగాలని అందుకు గ్రామా స్థాయిలో ఉద్యమాలను చేపట్టి బీసీ నాయకత్వాన్ని బలోపేతం చేయాలన్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్‌ను అభివృద్ధి చేయండి

ముఖ్యమంత్రికి మార్కెట్ కమిటీ చైర్మన్ వినతి



సీఎం రేవంత్ రెడ్డిని కలసిన బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, వైఎస్ చైర్మన్

కంటోన్మెంట్: నగరంలోని అతిపెద్ద కూరగాయల మార్కెట్ అయిన బోయిన్‌పల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్కెట్ యార్డును అభివృద్ధి చేయాలని కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ డీబీ దేవేందర్‌తో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. సికింద్రాబాద్‌లోని మోండా నుంచి మార్కెట్ యార్డును బోయిన్‌పల్లికి తరలించి దాదాపు పాతికేళ్లు అవుతున్నా ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. తాగునీటి సదుపాయంతో పాటు డ్రైనేజీ లైన్‌లను ఆధునీకరించాల్సి ఉందని వివరించారు. మార్కెటింగ్ శాఖ నుంచి రావాల్సిన సుమారు రూ.కోటితో పాటు అదనపు నిధులు కేటాయించాలని విన్నవించారు. పికెట్‌లోని నల్లపోచమ్మ ఆలయాన్ని దర్శించుకోవాలని డీబీ దేవేందర్ ముఖ్యమంత్రిని ఆహ్వానించగా, వీలైనంత త్వరలో వస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ముగిసిన కార్ఖానా మహంకాళి బోనాల జాతర



కార్ఖానా మహంకాళి ఆలయం రంగంలో భవిష్యవాణి వినిపిస్తున్న మాతంగి స్వర్ణలత

రసూల్‌పురా: మూడు రోజుల పాటు జరిగిన కార్ఖానా మహంకాళి శ్రావణమాస బోనాల జాతర సోమవారం రాత్రి జరిగిన రంగం కార్యక్రమంతో ముగిసింది. మారేడుపల్లికి చెందిన మాతంగి స్వర్ణలత పచ్చికుండపై నిలబడి భవిష్యవాణి చెప్పింది. అమ్మవారి దర్శనం చేసుకునేందుకు ఆలయానికి భక్తులు రావడం మానుకున్నారని, వారానికి ఒకసారి ఆలయానికి వచ్చి భక్తులు నన్ను దర్శించుకొని పూజలు చేయాలని, ఆలయంలో చండిహోమం జరిపించండి అంతా శుభం జరుగుతోందని చెప్పారు. భక్తులు బోనాలు సమర్పించడంతో సంతోషించాను అని అన్నారు. ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ఆలయం ఎదురుగా రోడ్డుపై ఉన్న వేపచెట్టు తొలగించొద్దని ఇక మహమ్మారి వ్యాపించకుండా భక్తులు పూజలు చేయండి అని భవిష్యవాణి పలికింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మహదేవ్ సింగ్, చైర్మన్ రామారావు, జనరల్‌సెక్రటరి సంతోష్, జాయింట్ సెక్రటరీ జీతూ, కోశాధికారి అంబేడ్కర్, భక్తులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన గొల్లకురుమలు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న గొల్లకురుమ సంఘం నేతలు

లాలాపేట: రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా. అశోక్‌యాదవ్ నేతృత్వంలో ఆ సంఘం నాయకులు మినిస్టర్ క్వార్టర్స్‌లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసి వారి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొల్లకురుమల ఆర్థికాభివృద్ధికి 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. నూతన జిల్లాల ఏర్పాటుతో సహకార సంఘాల విభజన చేసి, వాటికి ఎన్నికలు జరిపించాలని అన్నారు. చిన్నా భిన్నమైన వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో గొర్రెలు, మేకలు, బర్రెలు మంజూరు చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ చేపట్టాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో సర్పంచుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సాధాని భూమయ్య యాదవ్, ఎంకే. రాజేశ్ తదితరులున్నారు.

అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు ఆనందంగా ఉండాలి

ఎమ్మెల్యే ముఠా గోపాల్



అమ్మవారి పలహారపు బండి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే గోపాల్

బన్సీలాల్‌పేట్: అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు ఆనందంగా, సుఖశాంతులతో జీవించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్లకొమురయ్య కాలనీలో ప్రీతం, కోడూరు రాజు, పవన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ఫలహారపు బండి ఊరేగింపుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రజలు అమ్మవారి బోనాల వేడుకలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు జయసింహ, గోపాల్, తలసాని సైకిలాబ్ యాదవ్, తహసీల్దార్ కె. నిరంజన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, వెంకటరమణ, భాస్కర్, గోపన్న, జాన్‌భాయ్, కాంగ్రెస్ నాయకులు మధు, పి. ధర్మేందర్, ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గొల్లకొమురయ్య కాలనీ నుంచి బయలుదేరిన అమ్మవారి పలహారపు బండి ఊరేగింపు బోయిగూడ, కట్టెల మండి, ఐడిహెచ్ కాలనీ ప్రాంతాల గుండా కనుల పండువగా సాగింది.

వరదనీరు సాఫీగా ప్రవహించేలా చేయండి

కార్పొరేటర్ మహేశ్వరి



బేగంపేట చీకోటి గార్డెన్స్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి

సనత్‌నగర్: రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంగా పనిచేయాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి అన్నారు. బేగంపేట చీకోటి గార్డెన్స్‌లో మంగళవారం ఆమె పర్యటించారు. ఇక్కడి రోడ్డుపై వరదనీటితో పాటు మురుగు చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండడం చూసి అధికారులపై సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవసరమైతే పైప్‌లైన్ల సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వరదనీరు, డ్రైనేజీ పైప్‌లైన్లు వేర్వేరుగా ఏర్పాటు చేయడం ద్వారా ఎక్కడా కూడా నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా చూడవచ్చన్నారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో ఎప్పటికప్పుడు వరద నీరు సాఫీగా సాగేలా చేయడం ద్వారా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులతో పాటు బీఆర్ఎస్ నేతలు శ్రీహరి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొస్టేట్ కేన్సర్‌కు అత్యాధునిక చికిత్స

దక్షిణాసియాలోనే తొలి తుల్సా–ప్రొ ప్రారంభించిన కిమ్స్ ఆస్పత్రి



సాక్షి, సిటీబ్యూరో: ప్రొస్టేట్ కేన్సర్‌కు తుల్సా–ప్రొ (ట్రాన్స్ యురేథ్రల్ అల్ట్రాసౌండ్‌అబ్లేషన్ ప్రొస్టేట్) అనే అత్యాధునిక చికిత్స పద్ధతిని అందుబాటులోకి తెచ్చామని కిమ్స్ ఆస్పత్రి చైర్మన్ బొల్లినేని భాస్కర్‌రావు తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ ఆస్పత్రిలో ఈ పరికరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయి సాంకేతికతను సౌత్ ఆసియాలోనే తొలిసారి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రి అందుబాటులోకి తీసుకురావడం గర్వంగా భావిస్తున్నామన్నారు. వైద్యులు మాట్లాడుతూ ఎలాంటి కాంప్లికేషన్స్ లేకుండా డేకేర్ చికిత్సా విధానం అందుబాటులోకి వచ్చిందన్నారు. కోత లేకుండా చికిత్స ఉంటుందని, ఉదయం వచ్చి వైద్యం చేయించుకొని సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లిపోవచ్చన్నారు. ఎప్పటిలాగే అన్ని పనులు చేసుకోవచ్చని తెలిపారు. 50 ఏళ్లు పైబడిన వారిలో ఎక్కువ మందిలో ప్రొస్టేట్ కేన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది. త్వరగా గుర్తిస్తే పూర్తి స్థాయిలో నయం చేయవచ్చని తెలిపారు. మూత్రనాళం ద్వారా ప్రవేశపెట్టి కణజాలాన్ని తొలగిస్తారని, అదే రోజు డిచ్చార్జి చేస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యులు లిఖితేశ్వర్, ప్రశాంత్, శ్రీకాంత్, కేవీఆర్ ప్రసాద్, నరేంద్ర త్రివేది తదితరులు పాల్గొన్నారు.